క్లుప్తంగా

ప్రభుత్వ వైఖరిపై నిరసన



నిరసన తెలుపుతున్న పీడీఎస్‌ఓ నేతలు, విద్యార్థులు

తిరుపతి సిటీ : విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న ప్రభుత్వ వైఖరిపై శుక్రవారం ఎమ్మార్‌పల్లె సర్కిల్‌లో పీడీఎస్‌ఓ నేతలు నిరసన తెలిపారు. పీడీఎస్‌ఓ జిల్లా కార్యదర్శి ఆర్‌.ఆషా మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజురీయింబర్స్‌మెంట్‌కు గాను రెండేళ్లకు రూ.7,800 కోట్లు చెల్లించాల్సి ఉందని, అయితే ప్రభుత్వం కేవలం రూ.1,400 కోట్లు మాత్రమే విడుదల చేసి చేతులుదులుపుకుందని ఆరోపించారు. పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నేతలు స్రవంతి, సభ్యులు దేవేంద్ర, బాలాజీ, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

వకుళామాత సేవకు పోటెత్తిన భక్తులు

తిరుపతి రూరల్ : పేరూర బండపై వెలసిన తిరుమల శ్రీవారి తల్లి వకుళామాత ఆలయానికి భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం తొలి శుక్రవారం నేపథ్యంలో ఉదయం 6గంటల నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

బధిరులకు చిత్రలేఖనం పోటీలు

తిరుపతి సిటీ : వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో టీటీడీ బధిర పాఠశాల విద్యార్థులకు శుక్రవారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ప్లాస్టిక్ వద్దు అనే అంశంపై సీనియర్లు, భూమాతను కాపాడుకుందాం అనే అంశంపై జూనియర్లు, జాతీయ జెండా అనే అంశంపై సబ్‌జూనియర్ విద్యార్థులకు మూడు కేటగిరీలలో ఈ పోటీలను నిర్వహించారు. ఆగస్టు 15వ తేదీని విజేతలకు బహుమతులు అందించనున్నారు. పోటీలను పిన్సిపల్ రమణమూర్తి, వేమన విజ్ఞానకేంద్రం ప్రతినిధి నెల్లూరి మునిలక్ష్మి, బధిర పాఠశాల డ్రాయింగ్ టీచర్ నాగమణి పర్యవేక్షించారు.

వైభవంగా అర్జున తపస్సు

రామచంద్రాపురం : సి.రామాపురంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో మహాభారత ఉత్సవా ల్లో భాగంగా శుక్రవారం వైభవంగా అర్జున తప స్సు నిర్వహించారు. వందలాది మంది భక్తు లు తపస్సుకు హాజరై అర్జున వేషధారి విసిరిన పూజా సామగ్రిని అందుకునేందుకు పోటీపడ్డారు. ఈ సందర్భంగా ఆల య కమిటీ నిర్వాహకులు అన్నదానం చేపట్టారు.

చిరుత కలకలం

తిరుపతి మంగళం : ఎస్వీ జూ పార్క్ రోడ్డులో చిరుత సంచరిస్తోంది. శుక్రవారం రాత్రి ఆ మార్గంలో వెళుతున్న వాహనదారునిపై దాడి చేసేందుకు యత్నించింది.ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో అష్టలక్ష్మీ వ్రతం


వ్రతం నిర్వహిస్తున్న పండితులు

తిరుపతి కల్చరల్ : శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ సహకారంతో శ్రీవారి సేవా గ్రూప్ ఆధ్వర్యంలో రామచంద్రపుష్కరిణి వేదిక వద్ద భక్తిశ్రద్ధలతో అష్టలక్ష్మీ వైభోగ వ్రతం నిర్వహించారు. హిందూ ధర్మ పరిషత్ అధ్యక్షుడు సత్యనారాయణస్వామి ఆధ్వర్యంలో చేపట్టిన పూజ ల్లో 600 మహిళలు పాల్గొన్నారు. వ్రతం పూర్తయిన తర్వాత మహిళలకు అమ్మవారి కుంకుమ, పసుపుదారం, గాజులు, ప్రసాదం పంపిణీ చేశారు. నిర్వాహకులు చంద్రమౌళి, ప్రసన్నలక్ష్మి, వసుంధర, గీతాంజలి, సరళ పాల్గొన్నారు.

టీటీడీకి రూ.20 లక్షల విరాళం


డీడీ అందిస్తున్న దాత

తిరుమల : తిరుపతికి చెందిన ఎల్వీ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చైర్మన్ పీసీ రాయల్ గురువారం వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం అందించారు. అలాగే బెంగుళూరుకు చెందిన సుకుమార్ అనే భక్తుడు బాలాజీ ఆరోగ్య వర ప్రసాదిని (స్విమ్స్) పథకానికి రూ.10 లక్షలను విరాళంగా అందజేశారు. ఈ మేరకు టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరికి డీడీలను అందించారు.

తమ్ముళ్ల అంతర్మథనం!



ఎన్నికల బరిలో దిగే వరకు కార్యకర్తలే దేవుళ్లు అంటారు. ప్రచారం సమయంలో సకల బాధ్యతలు అప్పగిస్తారు.. పోలింగ్ ముగిసే వరకు సాష్టాంగ ప్రమాణాలు ఆచరిస్తారు. తీరా పీఠం ఎక్కిన తర్వాత శ్రేణులను చీమలు.. దోమల్లా చూస్తారు. చంద్రగిరి నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలకు ఇప్పుడు ఇదే దుస్థితి దాపురించిందని ఆ పార్టీ నేతలే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. ముఖ్యనేత వ్యవహారశైలి పూర్తిగా మారిపోవడంతో తెలుగు తమ్ముళ్లు దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నట్లు వెల్లడిస్తున్నారు. అధికారంలోకి వచ్చినప్పటికీ తగిన గుర్తింపు లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనికోసమా ఇంత కష్టపడింది అని అంతర్మథనం చెందుతున్నట్లు పలువురు వివరిస్తున్నారు.

- చంద్రగిరి నియోజకవర్గ ముఖ్యనేత తీరుపై అసంతృప్తి
- టీడీపీ కార్యక్రమాలకు దూరంగా ఓ వర్గం శ్రేణులు
- ఓ కీలక నేత సైతం విముఖతతో ఉన్నట్లు కార్యకర్తల గుసగస

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : చంద్రగిరి నియోజకవర్గంలోని టీడీపీ ముఖ్యనేత తీరుపై సొంత పార్టీ క్యాడరే విసిగిపోయినట్లు తెలిసింది. ప్రజాప్రతినిధి అయిన ఏడాది తర్వాత, ఆయన వైఖరిలో చాలా తేడా వచ్చేసిందని ఆవేదన చెందుతున్నట్లు సమాచారం. పార్టీ కోసం కష్టపడి, రూ.కోట్లు అప్పు చేసి ఖర్చు పెట్టినా ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత తమతో నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై పలువురు నేతలు తిరుగుబావుటా ఎగురవేసినట్లుగా తెలుస్తోంది. తగిన గుర్తింపు, గౌరవం లేకపోవడంతో పలువురు సీనియర్ నేతలు ఇప్పటికే పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు.

ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తి కావడంతో తొలి అడుగు కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తోంది. అయితే చంద్రగిరిలో మాత్రం నాయకులు మొక్కుబడిగా నిర్వహిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

ప్రాధాన్యత ఏదీ..?

సార్వత్రిక ఎన్నికల సమయంలో సుమారు రూ.4కోట్లకు పైగా నేను ఖర్చుపెట్టా. ఇప్పుడు ప్రాధాన్యత లేని పదవిని కట్టబెట్టి చేతులు దులుపుకున్నారంటూ చంద్రగిరికి చెందిన ఓ నేత కినుక వహించినట్లు తెలుగు తమ్ముళ్లు చెవులు కొరుకుంటున్నారు. ఆ నేత బాటలో ఆయన వర్గం సైతం పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో సదరు నేతను బుజ్జగించేందుకు నియోజకవర్గ ముఖ్య నాయకుడు నేరుగా ఇంటికి వెళ్లి మరీ చర్చలు జరిపినట్లుగా తెలిసింది. దీంతో ఆయనకు వచ్చిన పదవిని అయిష్టంగానే స్వీకరించినట్లు సమాచారం.

తూతూమంత్రంగా సహకారం

తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు తూతూమంత్రంగా సహకరిస్తున్నట్లు ఓ నాయకుడు నియోజకవర్గ నేతకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ప్రధానంగా చంద్రగిరిలో పార్టీ కార్యక్రమం నిర్వహించేందుకు ఎవరూ ముందు రావడం లేదని, చేసేది లేక మమ అనిపిస్తున్నామంటూ వివరించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పదవులు పొంది కూడా రాకపోతే ఎలా అంటూ ముఖ్యనేత మండిపడినట్లు తమ్ముళ్లు చెప్పుకుంటున్నారు. తిరుపతి రూరల్ మండలంలోని మరో కీలకనేత సైతం పార్టీపై తీవ్ర అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. ఎన్నికల సమయంలో రూ.కోట్లు ఖర్చు చేస్తే ఇప్పుడు సంపాదించుకోకుండా అడ్డుకుంటున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. ఇదే క్రమంలో పాకాల, రామచంద్రాపురం, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెంలో సైతం పార్టీ క్యాడర్ ముందులా ఉత్సాహంగా లేరని వ్యాఖ్యానిస్తున్నారు. ఏ.రంగంపేటలోనూ ఓ టీడీపీ సీనియర్ నేతకు తీవ్ర అన్యా యం జరిగినట్లుగా తెలుస్తోంది. తరతరాలుగా అనుభవించుకుంటున్న భూమిలోని నుంచి దారి ఇవ్వాలంటూ రెవెన్యూ అధికారులు ఒత్తిడి చేయ డం, ముఖ్యనేత పీఆర్‌ఓ అంటూ ఓ వ్యక్తి బెదిరింపులకు దిగడంపై ఆవేదన చెందుతున్నట్లు సమాచారం.

అధినేతకూ అసంతృప్తే!

ఇటీవల ముఖ్య నేత ఇంట్లో వ్యక్తికి కోల్పోయిన క్రమంలో సీఎం చంద్రబాబు తిరుపతి పర్యటనలోనే ఉన్నారు. తొలుత సీఎం చంద్రబాబు సదరు నేత ఇంటికి వెళ్లి పరామర్శించనున్నట్లు తమ్ముళ్లు ప్రచారం చేశారు. అయితే కొన్ని గంటల్లోనే ముఖ్యమంత్రి రావడం లేదంటూ సమాచారం రావడంతో నిరాశకు లోనయ్యారు.నియోజకవర్గ నేతపై సీఎం అసంతృప్తిగా ఉండడంతోనే తన పర్యటనను రద్దు చేసుకున్నారంటూ సొంత పార్టీనేతలు బహిరంగంగానే చర్చించుకుంటూ ఉండడం గమనార్హం.

నోటీస్ బోర్డు

- శ్రీగోవిందరాజస్వామి ఆలయ మాడవీధుల్లో ఉదయం 4.45 గంటలకు నగర సంకీర్తన.
- ఎయిర్ బైపాస్ రోడ్డులోని పీఎల్‌ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో టేప్ ఎక్స్‌పో ప్రారంభం.
- అభినయ ఆర్ట్స్ జాతీయ నాటకోత్సవాల్లో భాగంగా మహతిలో ఉదయం 9.30 నుంచి నృత్య, నాటక ప్రదర్శనలు.
- నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో సాయంత్రం 5 గంటలకు 'కింగ్ డమ్ సినిమా ఈవెంట్.
- శ్రీకోదండరామాలయంలో ఉదయం 6 గంటలకు స్వామివారికి అభిషేకం, సాయంత్రం 5 గంటలకు ఊరేగింపు.

'భృతి' అమలుకు డిమాండ్


మాట్లాడుతున్న రామకృష్ణ

తిరుపతి కల్చరల్: ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చిన మేరకు నిరుద్యోగ భృతిని అమలు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం గంధమనేని శివయ్య భవన్‌లో ఏఐవైఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని, యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలపై స్పష్టమైన రోడ్ మ్యాప్ ప్రకటించాలన్నారు. ఈ క్రమంలోనే ప్రతి నిరుద్యోగికీ నెలకు రూ.3వేల భృతి చెల్లించాలని కోరారు. హామీలను అమలు చేయకుంటే అసెంబ్లీ ముట్టడికి కూడా పిలుపునిస్తామని స్పష్టం చేశారు. నేతలు విక్రమ్, పూర్ణ, రాజుకుమార రామకృష్ణ, మునేశ్వర్, నాగరాజు, శ్రీకాంత్, రవి, తరుణ్ పాల్గొన్నారు.

28న టీటీడీ పాఠశాలల్లో 'సద్గమయ'

తిరుపతి సిటీ/తిరుపతి అన్నమయ్యసర్కిల్ : టీటీడీ పాఠశాలల్లోని విద్యార్థులకు మానవీయ, నైతిక విలువలు, సంస్కృతి, సంప్రదాయాలు, వ్యక్తిత్వ వికాసంపై సద్గమయ పేరిట శిక్షణ ఇవ్వనున్నట్లు టీటీడీ అధికారులు శుక్రవారం తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 28వ తేదీన నగరంలోని ఎస్‌జీఎస్ హైస్కూల్, ఎస్వీ ఓరియంటల్ హైస్కూల్, ఎస్వీ హైస్కూల్, ఎస్‌కేఆర్‌ఎస్ ఇంగ్లీషు మీడియం స్కూల్, పద్మావతి బాలికల పాఠశాల, తాటితోపు వద్ద ఎస్‌కేఎస్ హైస్కూల్, తిరుమలలోని ఎస్వీ హైస్కూల్‌లోని 8, 9, 10 తరగతులు చదివే డే స్కాలర్ విద్యార్థులకు నాలుగు రోజుల పాటు ఒక గంట చొప్పున శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ప్రత్యేకంగా శిక్షణ పొందిన 70 మంది ఉపాధ్యాయు లు ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు.

ఫ్లెక్సీలు పెడితే చర్యలు

తిరుపతి సిటీ : ఎస్వీయూలో విద్యా సమాచారంతో కూడిన ఫ్లెక్సీలు తప్ప ఇతర ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని వీసీ సీహెచ్ అప్పారావు హెచ్చరించారు. ఈ మేరకు రిజిస్ట్రార్ భూపతినాయుడు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వర్సిటీలో విద్యా వాతావరణాన్ని కలుషితం చేసేలా ఫ్లెక్సీల సంస్కృతి పెరగడం బాధకరమన్నారు. విశ్వవిద్యాలయంలో ఇలాంటి వాటిని అనుమతించబోమని పేర్కొన్నారు.

పారిపోయిన పిల్లల అప్పగింత

తిరుమల : పారిపోయి తిరుమలకు చేరుకున్న నలుగురు విద్యార్థులను తిరుమల టూటౌన్ పోలీసులు శుక్రవారం పట్టుకుని అనంతపురం పోలీసులకు అప్పగించారు. సీఐ శ్రీరాముడు కథనం మేరకు.. అనంతపురంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం విద్యార్థులు పారిపోయి తిరుమలకు చేరుకున్నారు. దీనిపై హాస్టల్ వార్డెన్ ఫిర్యాదు చేయడంతో అనంతపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పిల్లలు తిరుమలకు వచ్చినట్లు తెలియడంతో వెంటనే కొండపై పోలీసులను అప్రమత్తం చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా అలిపిరి మెట్ల మార్గంలో తిరుపతికి దిగుతున్న విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కౌన్సెలింగ్ ఇచ్చి అనంతరం పోలీసులకు అప్పగించారు.

'పద్మావతి'లో నాణ్యమైన విద్య


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ భువనేశ్వరి

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ భువనేశ్వరి తెలిపారు. శుక్రవారం స్పాట్ అడ్మిషన్లలో భాగంగా కళాశాల విచ్చేసిన విద్యార్థులు, తల్లిదండ్రులకు కాలేజీ విధివిధానాలపై అవగాహన కల్పించారు. అలాగే ఎస్వీ బాలుర జూనియర్ కళాశాలలో శుక్రవారం చేపట్టిన స్పాట్ అడ్మిషన్లలో 91 సీట్లు భర్తీ అయినట్లు ప్రిన్సిపల్ ప్రకాష్‌బాబు వెల్లడించారు.

హామీల పేరుతో నయవంచన!



రీకాలింగ్ చంద్రబాబు క్యూఆర్ కోడ్ చూపుతున్న మాజీ మంత్రి రోజా

నింద్ర : జగనన్న ఇచ్చిన ప్రతి పథకాన్నీ అమలు చేస్తామని చెప్పారు. సూపర్ సిక్స్‌ను కూడా జూన్ నుంచే అమలులోకి తీసుకొస్తామని జబ్బలు చరిచారు. ఏడాది గడిచినా ఆ మాటే అనుకోవడం లేదు. మేనిఫెస్టోను డస్ట్‌బిన్‌లో వేశారు. రాష్ట్ర ప్రజలను చీటింగ్ చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌పై 420 కేసు ఎందుకు నమోదుచేయకూడదు? అని మాజీ మంత్రి ఆర్కే రోజా ప్రశ్నించారు. నింద్ర మండలం, మిట్టకండ్రిగ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా చంద్రబాబు మేనిఫెస్టోను సవివరంగా తెలుసుకోవచ్చని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ హామీ నెరవేర్చక అన్ని హామీలు నెరవేర్చేశాం అని చెప్పుకునే ధీరుడు చంద్రబాబు అన్నారు. హామీలు నెరవేర్చలేదని ఎవరైనా చెబితే వారికి నాలిక మందం అంటున్నారన్నారు. హామీలు నెరవేరుస్తాం అంటూ మేనిఫెస్టోలో సంతకాలు చేసి అధికారంలోకి వచ్చిన సీఎం, డిప్యూటీ సీఎం ఏరు దాటాక తెప్ప తగులబెట్టినట్లు మేనిఫెస్టోను తగలబెట్టేశారన్నారు. సంతకం పెట్టి మోసం చేసిన వీరిని చీటర్లు అని ఎందుకు అనకూడదన్నారు?. 2.07 లక్షల మందికి 13 నెలలుగా ఆడబిడ్డ నిధి కింద రూ.35 వేల కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. ఇది ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాలని అడ్డదిడ్డంగా మంత్రి అచ్చెన్నాయుడు అంటున్నారన్నారు.

అప్పు చేయడంలో బాబు ఫస్ట్

ఏ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ఏడాదిలోనే రూ.1.8 లక్షల కోట్లు అప్పుచేసి చెత్తరికార్డును చంద్రబాబు మూటగట్టుకున్నారని మాజీ మంత్రి ఆర్కే రోజా విమర్శించారు. నాడేమో అప్పులతో రాష్ట్రం శ్రీలంక అయిపోతుందన్న పెద్దమనిషి నేడు ఎందుకు ఇంత అప్పుచేశారని నిలదీశారు. జగన్న తెచ్చిన మెడికల్ కళాశాలలు పూర్తిచేయలేదని, అభివృద్ధి పనులు చేపట్టడం లేదని అప్పులు మాత్రం లక్ష కోట్లు దాటిపోయాయని ఎద్దేవా చేశారు. ప్రతి అంశాన్నీ ప్రజలు గమనిస్తున్నారని, తప్పక బుద్ధిచెబుతారన్నారు.

విమర్శనాత్మక గ్రంథాల ఆవిష్కరణ


గ్రంథాలను ఆవిష్కరిస్తున్న వీసీ, అధ్యాపకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో డాక్టర్ మౌని సాహిత్యంపై వచ్చిన రెండు విమర్శనాత్మక గ్రంథాలను శుక్రవారం వీసీ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ డాక్టర్ మౌని వర్సిటీ తెలుగు విభాగంలో పీహెచ్‌డీ పట్టా పొంది టీటీడీలో విధులు నిర్వర్తిస్తూ పలు కీర్తనలను రచించారని తెలిపారు. ఆ సాహిత్యాన్ని విశ్లేషిస్తూ అవధాని ఆముదాల మురళి రాసిన ఈ గ్రంథం పరిశోధకులకు, ఆధ్యాత్మికులకు ఉపయోగపడుతుందన్నారు. ఎస్ఎస్‌యూ డీన్ ప్రొఫెసర్ దక్షిణమూర్తి శర్మ, ప్రాచ్య పరిశోధన సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాళ్ల వెంకటేశ్వర్లు, పద్మావతి, శ్రీనివాసులు, రచయిత కృష్ణస్వామి, చెన్న కేశవనాయుడు పాల్గొన్నారు.

'దేవరకొండ' వ్యాఖ్యలు దారుణం


మాట్లాడుతున్న హరిప్రసాద్ నాయక్

తిరుపతి కల్చరల్ : గిరిజన జాతిపై సినీనటుడు విజయ్‌దేవరకొండ వ్యాఖ్యలు దారుణమని, ఈ సందర్భంగా ఆయన నటించిన కింగ్‌డమ్ చిత్ర ఈవెంట్‌కు ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలని నిఘా నేత్ర స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షుడు హరిప్రసాద్ నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 26న హైదరాబాద్‌లో నిర్వహించిన రెట్రో చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ 500 ఏళ్ల క్రితం గిరిజనులు కొట్టుకున్నట్లు అభిమానులు వ్యవహరిస్తున్నారని హేళనగా మాట్లాడారని మండిపడ్డారు. ఇటీవల పెహల్గామ్ ఘటనలో దేశం కోసం ప్రాణాలను అర్పించిన జవాన్ మురళీ నాయక్ గిరిజన బిడ్డ అని గుర్తించాలన్నారు. కింగ్‌డమ్ ఈవెంట్‌ను తిరుపతిలో నిర్వహిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. నేతలు రవీంద్ర నాయక్, శివశంకర్ నాయక్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం


అధికారులతో సమీక్షిస్తున్న ఎండీ శివప్రసాద్

తిరుపతి రూరల్ : తిరుపతి జిల్లాలోని లే అవుట్లలో గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించాలని గృహ నిర్మాణ శాఖ ఎండీ ఎం.శివప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని చిందేపల్లె, ఊరందూరులోని ఎన్టీఆర్ నగర్ లే అవుట్లను పరిశీలించారు. అనంతరం ఎస్వీ యూనివర్సిటీలోని శ్రీనివాస ఆడిటోరియంలో అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మూడు లక్షల ఇళ్లలో గృహ ప్రవేశాలు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. ఇందులో భాగంగా తిరుపతి జిల్లాలో 14 వేల ఇళ్లను పూర్తి చేయించి లబ్ధిదారులతో ఆగస్టు 15వ తేదీన గృహ ప్రవేశం చేయించాల్సి ఉందన్నారు. ఇంజినీర్లు లబ్ధిదారులతో మాట్లాడి పనులు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. జిల్లా గృహ నిర్మాణశాఖ

దొంగనుకుని చితకబాదారు!

చంద్రగిరి : అనుమానాస్పదంగా సంచరిస్తున్న యువకుడిని దొంగ అనుకుని గ్రామస్తులు చితకబాదిన ఘటన గురువారం అర్ధరాత్రి మల్లయ్యపల్లెలో జరిగింది. వివరాలు.. పెనుమూరుకు చెందిన సురేష్ ద్విచక్ర వాహనంలో మల్లయ్యపల్లెకు వచ్చాడు. గ్రామంలో తిరుగుతుండగా కొందరు గమనించి దొంగ దొంగ అని అరిచారు. దీంతో సురేష్ భయపడి పక్కనే ఉన్న ముళ్ల పొదలో దాక్కున్నాడు. దీంతో గ్రామస్తులు మరింతగా అనుమానించి సురేష్‌ను బయటకు లాగి విద్యుత్‌స్తంభానికి కట్టేసి చితకబాదారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే గ్రామానికి చేరుకుని యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న సురేష్ కుటుంబీకులు హుటాహుటిన పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. మల్లయ్యపల్లెకు చెందిన యువతిని పెనుమూరులో బంధువుకు ఇచ్చి వివాహం చేశారని, వారికోసం సురేష్ వచ్చినట్లు పోలీసులకు వివరించారు. అనంతరం యువకుడికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి వదిలిపెట్టారు.

కియా కారెన్స్ క్లావిస్ ఈవీ కారు ఆవిష్కరణ


కారును ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ హోషిమా రెడ్డి తదితరులు

చంద్రగిరి : తిరుచానూరు సమీపంలోని హోషి ఆటో ప్రైవేట్ లిమిటెడ్ కియా కార్ షోరూమ్‌లో శుక్రవారం సాయంత్రం కియా కారెన్స్ క్లావిస్ ఈవీ కారును ఆవిష్కరించారు. మేనేజింగ్ డైరెక్టర్ సి.జగన్నాథరెడ్డి, డైరెక్టర్ చెరకు నిరంజన్, సి.భారతి, సి. హోషిమా రెడ్డిలతో పాటు ముఖ్య అతిథులు పాల్గొన్నారు. జగన్నాథరెడ్డి మాట్లాడుతూ కియా కారెన్స్ క్లావిస్ ఈవీ కారులో 200 ఎంఎం గ్రౌండ్ క్లియరెన్స్, 42 కెడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్‌తో ఒక్కసారి చార్జింగ్ చేస్తే 404 కిలోమీటర్లు వరకు సునాయాసంగా ప్రయాణం సాగించవచ్చునని తెలిపారు. అదే విధంగా 51.4 కెడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్ ద్వారా 490 కిలోమీటర్లు రేంజ్‌ను అందిస్తుందన్నారు. 100 కెడబ్ల్యూ డీసీ ఫాస్ట్ ఛార్జర్ ఉపయోగించి 10శాతం నుంచి 80శాతం వరకు చార్జ్ చేయడానికి 39 నిమిషాలే సమయం పడుతుందని చెప్పారు. 26.62 ఇంచ్‌ల పానోరమిక్ డిస్‌ప్లే ప్యానెల్‌ను వినియోగదారులకు అందిస్తున్నామన్నారు. ఈ కారు ఎక్స్ షోరూం ధర రూ.17.99లక్షల నుంచి ప్రారంభం అవుతుందని, 4 వేరియంట్లలో డ్రైవింగ్ రేంజ్ 404 కిలోమీటర్ల, 490 కిలోమీటర్లలో లభ్యమవుతుందని వివరించారు. బుకింగ్ కోసం 86888 29739 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పెన్షనర్ల సమస్యలపై ఆందోళన



నిరసన తెలుపుతున్న నేతలు

తిరుపతి కల్చరల్ : కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం నాలుగు కాళ్ల మండపం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ రవి మాట్లాడుతూ 2025 పెన్షన్ నియామకాల బిల్లులో చేసిన సవరణలను వెంటనే ఉపసంహరించుకోవాలని, 8వ కేంద్ర వేతన సంఘ నియమ నిబంధనలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. నేతలు గోవిందస్వామి, రామచంద్రయ్య, ఎం.శివ, శ్రీను, ప్రమీల, రంగయ్య, వైఎస్ రాజు, పి.దుర్గయ్య, బి.గుర్రప్ప, చంద్రశేఖర్, కుమార్ స్వామిరెడ్డి, బాలకృష్ణయ్య, ఆర్.వెంకటయ్య, జి.జయంతికుమార్, హస్సన్ సాహెబ్, రంగయ్య పాల్గొన్నారు.

త్వరితగతిన భూ సమస్యల పరిష్కారం

తిరుపతి అర్బన్ : ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలు, అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ చైర్మన్, కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కమిటీ సమావేశంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తి, డీఆర్వో నరసింహులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ గత సమావేశంలో చర్చకు వచ్చిన సమస్యల పరిష్కారంపై ఆరా తీశారు. అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, గూడూరు సబ్ కలెక్టర్ రాఘువేంద్ర మీనా, సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికార అధికారి విక్రమ్ కుమార్ రెడ్డి, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, డీవీఎంసీ సభ్యులు, జిల్లా అధికారులు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కళాక్షేత్రంలో మహిళా వేదిక


కళాకారిణిని సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : మహతి కళాక్షేత్రంలో ప్రదర్శిస్తున్న అభినయ ఆర్ట్స్ జాతీయ నాటక పోటీలు శుక్రవారంతో ఏడవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా మహిళా వేదిక కార్యక్రమం నిర్వహించారు. విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, సాహితీ వేత్త గంగవరం శ్రీదేవి, అధ్యాపకులు డాక్టర్ కొణిదల శోభ, విశ్రాంత అధికారి ఏనుగు గీత, నృత్య కళాకారిణి కంచిభట్ల వాణి అనగ అతిథులుగా హాజరై ప్రసంగించారు. నాటక, నృత్య కళలను పరిరక్షిస్తున్న అభినయ ఆర్ట్స్ కార్యదర్శి బీఎన్. రెడ్డి అభినందనీయులని కొనియాడారు. అనంతరం కంచిభట్ల వాణి అనగకు స్వర్ణ మయూరి పురస్కారం ప్రదానం చేశారు. ఈ క్రమంలో కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద బృంద నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా పీసీ రాయులు జన్మదినోత్సవం


పీసీ రాయులును సత్కరిస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్ : కస్తూర్బాగాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పీసీ రాయులు జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, సినీనటి నీరోషా, బీజేపీ నేత సామంచి శ్రీనివాస్, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, నేతలు ఎంఎల్.నాయుడు, విజయ్‌కుమార్, జయదేవరాజు, ఉమాపతి, డాక్టర్ రెడ్డెప్ప, డాక్టర్ ఏఆర్.రెడ్డి, ఉదయగిరి కృష్ణమూర్తి, బండి మధుసూదన్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

ఆటో దొంగ అరెస్ట్

తిరుపతి క్రైమ్ : నగరంలో పలు ఆటోను చోరీ చేసిన వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. కొర్లగుంట మారుతి నగర్‌కి చెందిన బాలరాజు శేషాద్రి రాజు ఆటో ఈనెల 21వ తేదీన అపహరణకు గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో చింతలచేను వద్ద అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా వాస్తవం వెల్లడైంది. తనపల్లె వద్ద ఇందిరమ్మ ఇళ్లలో నివసిస్తున్న పత్తి ఆదర్శ్‌ను నిందితుడిగా పోలీసులు గుర్తించారు. ఆటో స్వాధీనం చేసుకున్నారు.

సెల్‌ఫోన్ చోరీ కేసులో..

ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల నుంచి సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు తిరుమలశెట్టి సుబ్రమణ్యం నుంచి రూ.2.5లక్షల విలువైన రెండు ఐఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.